క్లుప్తంగా

ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభం



ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కల్నల్ వెంకటేష్, తదితరులు

పూసపాటిరేగ: ఫిజియోథెరపీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్నల్ ఆర్. వెంకటేష్ అన్నారు. మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో ఎస్ఎస్ఎంసీ ట్రస్ట్ సహకారంతో ఆధునీకరించిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ఇబ్బందులతో బాధపడుతున్న వ్యక్తులు కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణశర్మ, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



విజేతలతో కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ ఇటీవల నిర్వహించిన ఎక్తార-25 ఎక్స్‌పోలో ఉత్తమ ప్రాజెక్ట్‌లు ప్రదర్శించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శుక్రవారం ప్రత్యేకంగా అభినందించింది. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అలరించిన కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శంకరాదిత్య, తదితరులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 67వ సంగీత వార్షికోత్సవంలో భాగంగా కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వరంగల్‌కి చెందిన బొడ్డుపల్లి శంకరాదిత్య గాత్ర కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై సాయిభార్గవ్, మృదంగంపై విశాఖకు చెందిన సుబ్రహ్మణ్యం, ఘటంపై తెనాలికి చెందిన కానూరు రామకృష్ణ సహకారమందించారు. అనంతరం కళాకారులను సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కాంభట్ల శ్రీధర్, గంధం సుజాత, కాళ్ల నిర్మల సత్కరించారు. సంగీతాభిమానులు, శ్రోతలు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కళాశాల సందర్శన



కళాశాల విద్యార్థులతో కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలను కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ పి.తేజస్వి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుబ్బలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో కళాశాల కచేరీ మందిరంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్.శాస్త్రి, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొండి బకాయిదారులపై కొరడా..



పన్ను వసూలుకు రంగంలోకి దిగిన నగరపాలక సంస్థ, రెవెన్యూ సిబ్బంది

విజయనగరం: పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. చాలా కాలంగా పన్నులు చెల్లించని వివిధ సంస్థలు, భవనాల యజమానుల వద్దకు విజయనగరం కార్పొరేషన్ సహాయ కమిషనర్ కె. అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం నేరుగా వెళ్లి పన్ను చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పలువురు హుటాహుటిన పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించారు. మరికొందరు కొద్ది రోజుల గడువు కోరారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ అప్పలరాజు మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా అధిక శాతం పన్ను వసూలే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మొండి బకాయిదారుల భవనాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పులు గుర్తిస్తే.. తప్పనున్న తిప్పలు

- చిన్నారుల ధ్రువపత్రాల నమోదులో బహుపరాక్
- వివరాలు సక్రమంగా లేకుంటే తప్పని అవస్థలు
- అపార్ నమోదు ప్రక్రియలో బయటపడుతున్న తప్పిదాలు



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

విజయనగరం: జిల్లా కేంద్రానికి చెందిన నవీన్ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థికి అపార్ గుర్తింపు సంఖ్య నమోదు కోసం ప్రయత్నించగా ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రంతో తహసీల్దార్ కార్యాలయంలో పుట్టినతేదీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇలా నవీన్ ఒక్కరే కాదు.. చాలా మంది చిన్నారులు ఇదే తరహా సమస్యతో సతమతమవుతున్నారు. ఇందుకు తల్లిదండ్రులు సకాలంలో స్పందించకపోవడమే ప్రధాన కారణంగా ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి..

పాఠశాలల్లో ప్రవేశాలు.. పరీక్షలు.. ఉపకార వేతనాలకు వివిధ ధ్రువపత్రాలు అవసరమవుతాయి. వీటిల్లో పొందుపరిచే వివరాలు సరిగా లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. కొందరు తల్లిదండ్రులు వారి పిల్లల పేర్లు, ఇంటిపేరు, పుట్టిన తేదీ వివరాలను సరిగా నమోదు చేయించడం లేదు. ఆధార్ కార్డుల్లోనూ ఇష్టానుసారంగా పొందుపరుస్తున్నారు. చిన్నారులను పాఠశాలల్లో చేర్పించినప్పుడు కూడా వారి వివరాలపై పెద్దగా దృష్టి సారించండం లేదు. చిన్నారులు జన్మించినప్పుడే వివరాలను స్పష్టంగా నమోదు చేయించాలి.

ఆధార్ నమోదుకు..

చిన్నారి ఆధార్ నమోదు కోసం వెళ్లినప్పుడు ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాల నమోదులో తప్పు చేసే అవకాశం ఉంది. వివరాలు పూర్తిగా చెప్పిన తర్వాత సబ్మిట్ చేసేముందు సరిగా ఉన్నదీ, లేనిదీ తల్లిదండ్రులు చూసుకోవాలి. ఆ తర్వాతే సబ్మిట్ చేయాలి.

పాఠశాలలో ప్రవేశ సమయంలో..

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేటప్పుడు ఆధార్, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వివరాలు సరిచూసుకోవాలి. పాఠశాల వారు దరఖాస్తు ఫారం ఇచ్చినప్పటికీ మనం పూరించిన వివరాలు పాఠశాల రికార్డులో సరిగా ఉన్నాయా లేదో గమనించి తప్పుగా ఉంటే వెంటనే మార్పించుకోవాలి. చిన్నారులు పాఠశాలకు వెళ్లడం ప్రారంభించగానే స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని తీసుకోవాలి. ఇందుకోసం మీ సేవ, సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

పుట్టినప్పుడు..

చిన్నారులు జన్మించినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆస్పత్రిలో జన్మిస్తే సదరు ఆస్పత్రి వారు బిడ్డ వివరాలను నమోదు చేసుకున్నదీ, లేనిదీ ఆరా తీయాలి. నామకరణం రోజున ఏం పేరు పెట్టాలో తల్లిదండ్రులు ముందే నిర్ణయించుకుంటారు. అయితే బిడ్డ పేరు, తల్లిదండ్రులు, ఇంటి పేర్లు తప్పులు లేకుండా రాసుకోవాలి.

తప్పులతో ఇబ్బందులు..

చాలా మంది విద్యార్థుల వివరాలు తప్పుగా నమోదు కావడంతో అపార్‌లో నమోదు ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. మొదట్లో పట్టించుకోని తల్లిదండ్రులు ఇప్పుడు సక్రమమైన వివరాలతో వాటిని పొందడం కోసం ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాల విషయంలో శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

– ఎల్.శంకరరావు, ఉపాధ్యాయుడు, విజయనగరం

నగర క్రమబద్ధీకరణకు కృషి చేయండి





సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, హాజరైన కార్యదర్శులు

- కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రతిరోజూ క్షేత్ర పర్యటనలు చేస్తూ నగర క్రమబద్ధీకరణకు కృషి చేయాలని ప్రణాళికా కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి సమస్యలు తెలుసుకోవాలన్నారు. రహదారులపై భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాలు వేయకుండా నియంత్రించాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ప్రకటన పన్నులను శతశాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఇళ్ల గేట్లకు ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల ప్రకటన బోర్డులను వెంటనే తొలగించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఇళ్ల గేట్లకు తరచూ ప్రకటనలో బోర్డులు పెడుతున్న సంస్థలకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



రామతీర్థంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట, రామతీర్థం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రామకృష్ణరాజు శుక్రవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. పనులను వేతనదారులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. రెండు పూట లా పనిచేసి నిర్ణీత వేతనాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎమ్మెల్యేకు వినతి..

విజయనగరం గంటస్తంభం: ఆప్కాస్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతి విజయలక్ష్మికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్‌మోహన్‌రావు, బి.భాస్కరరావు, తదితరులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అరవై సంవత్సరాలు నిండాయనే కారణంతో ఇటీవల విధుల నుంచి తొలగించిన 12 మందిని 62 సంవత్సరాల వరకు కొనసాగించేలా చూడాలని కోరారు.

ఊపందుకున్న ప్రచారం..

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం ఉపాధ్యాయుల ప్రచారం ఊపందుకుంది. ఏపీటీఎఫ్ (257) అభ్యర్థి పాలకపాటి రఘువర్మను గెలిపించాలని శుక్రవారం స్థానిక ధర్మపురి ఉన్నత పాఠశాలలో పలువురు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల సాధనతో పాటు సామాజిక సేవలు చేయడంలో ముందున్న అభ్యర్థి రఘువర్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, బొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి మద్రాపు శ్రీనివాసరావు, దుర్గా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి వచ్చే నెల 31 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు 5వ తరగత స్థాయిలోనే తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

నెలాఖరులోగా సర్వేలు పూర్తి చేయాలి

విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న సర్వేలు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వార్డు అడ్మిన్, ఎమినిటీస్ కార్యదర్శులతో మాట్లాడారు. ఆస్తి పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ కె. అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

25న కన్యాశుల్కం ప్రదర్శన

విజయనగరం టౌన్: గురజాడ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ రాత్రి 7 గంటలకు గురజాడ కళాభారతిలో కన్యాశుల్కం దృశ్య రూపకం నిర్వహించనున్నట్లు దర్శకుడు జీఎస్.చలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చూసి ఆనందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ, వీసీబీ ఏర్పాటు, తదితర పనుల కారణంగా డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరవుపేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్మినెంట్ చేయాలి

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బాబూరావు కోరారు. ఈ మేరకు నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ అప్పలరాజులను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నియామకాలు..



సత్యనారాయణ మూర్తి



అప్పలనాయుడు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస గ్రామానికి చెందిన పతివాడ అప్పలనాయుడుని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడంతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అల్లాడ సత్యనారాయణ మూర్తి (రమేష్)ని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పని ఒత్తిడి తగ్గించాలి

- యూఎఫ్‌బీయూ జిల్లా కమిటీ డిమాండ్



నిరసన కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: బ్యాంకింగ్ రంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉన్న సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించాలని బ్యాంక్ ఉద్యోగుల ఐక్యవేదిక (యూఎఫ్‌బీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వారానికి ఐదు రోజుల పనిదినాలు వెంటనే అమలు చేయాలని కోరారు. బ్యాంకింగ్ రంగంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు వెంటనే నిలుపుదల చేసి, శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని నినాదాలు చేసారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉద్యోగ సంఘ నాయకులు రమేష్, దొర, జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రెసిడెంట్ బీవీ ప్రసాద్, సెక్రటరీ కె.మురళీశ్రీనివాస్, రవికుమార్, నాగభూషణరావు, అశోక్ నాయక్, శ్రావణ్, పి.శ్రీనివాసరావు, హరీష్, హరి, భానోజీరావు, చిన్నారావు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు..



పూసపాటిరేగ మండలంలోని పతివాడ ప్రాథమిక పాఠశాలకు విశాఖకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ప్రతినిధులు బోరు ఏర్పాటుకు రూ. 1.30 లక్షలు వితరణగా అందజేశారు. దీంతో పాఠశాల ఆవరణలో శుక్రవారం బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎ.రాజ్‌కుమార్, బి. పాపినాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హైమావతి, సర్పంచ్ పైడిరామ్, స్కూల్ కమిటీ చైర్మెన్ గోవిందరావు, ప్రతినిధిలు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

లక్ష్యంతో ముందుకు సాగాలి..



విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. హనుమంతురావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎంలు బి. శంకరరావు, చలం, నాగేశ్వరరవు, లీలాకృష్ణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

గురజాడలో మాతృభాషా దినోత్సవం..



విజయనగరంలోని గురజాడ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డప్పు శ్రీను తెలుగుభాష గొప్పదనంపై ఆలపించిన పాటతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పీవీఎల్ సుబ్బారావు, తెలుగుభాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురుప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధాన ఉపాధ్యాయుడు పూడి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

ఎన్నికల ప్రచారం



నెల్లిమర్ల మండలంలోని ఆలుగోలు ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ నేతలు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. ఈశ్వరరావు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి గాదె శ్రీనివాసులనాయుడు కృషి చేస్తారని, మొదటి ప్రాధాన్యత ఓటు ఆయనకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లాడ మహేష్, కాళ్ల అప్పారావు, కొండపల్లి బాలకృష్ణ, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

కళాకారులు ఎప్పుడూ జీవించే ఉంటారు..

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



నాటికలో ఓ సన్నివేశం

నెల్లిమర్ల: కళాకారులు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో జీవించి ఉంటారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామంలో ఆరిపాక బ్రహ్మనందం స్మారక నాటక పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాటక పోటీలకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులు, నెల్లిమర్ల మండల విద్యాశాఖాధికారి ఈపు విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ.. కళల పట్ల ఉన్న మక్కువతో నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ యూఎస్ఎన్ మూర్తి, లంక అప్పలనాయుడు, జన ప్రసాద్, ఎం ఎం నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, కాళ్ల రాజశేఖర్, అవనాపు మురళీకృష్ణ, డొంక కృష్ణ, సుంకర ముత్యాలనాయుడు, బోని వెంకటరమణ, కిల్లంపల్లి రామారావు, కనకల పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్

విజయనగరం అర్బన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప్ సహకారంతో స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో ఐదు రోజుల నుంచి 'జనరేట్ యువర్ బిజినెస్ ఐడియా' పేరుతో జరుగుతున్న అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. వ్యాపార నిర్వహణ, లావాదేవీలు వంటి అంశాలపై నిష్ణాతులు వి.అనిల్‌కుమార్, ఎల్‌డీఎం వీవీ రమణమూర్తి, మహిళా ప్రాంగణం మేనేజర్ పి.విమల అవగాహన కల్పించారు. ముగింపు సభలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అవగాహనతో వ్యాపారాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



విజయనగరం అర్బన్: ప్రశంసాపత్రం అందజేస్తున్న సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్ధననాయుడు

విజయనగరం అర్బన్: పట్టణంలోని విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు మాట్లాడుతూ.. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి అని అన్నారు. తెలుగు భాష అధ్యాపకుడు డాక్టర్ ఎల్. వరలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.గౌరీశ్వరరావు, బి.సులోచన, టి.రమణ, యామినీ మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకగా జరిగింది. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిటీ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎం.రమాగీతాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ జయపాలరావు, ఆంగ్ల విభాగాధిపతి సుభాషిణి, హిందీ విభాగాధిపతి డాక్టర్ బి.శుభ, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాష కమ్మనైనది..

విజయనగరం టౌన్: అమ్మవంటి మాతృభాష కమ్మనైనదంటూ విద్యార్థులు ప్రదర్శించిన తీరు చూపరులను ఆకట్టుకుంది. నగరంలోని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష వ్యాప్తికి విశేషంగా కృషిచేసిన గురజాడ, సీపీ బ్రౌన్, శ్రీ కృష్ణదేవరాయ, యోగి వేమన వంటి మహనీయుల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.